చిరకాల స్వప్నం సాకారం

43వ వార్డు శ్రీనివాసనగర్‌లో రూ.33.50 లక్షలతో బ్రిడ్జి విస్తరణ

కార్పొరేటర్ ఉషశ్రీకి స్థానికుల అభినందనలు



ఇది కదా అభివృద్ధి

నాడు

ఒకప్పుడు 32వ వార్డు ప్రస్తుతం 43వ వార్డు పరిధిలోని శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోశీలపాలెం ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలు వెళ్లడానికే తప్ప ఆటో, కార్లు వెళ్లే వీలు లేదు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చే మార్గం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వాలకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. గతంలో టీడీపీ, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మూడుసార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారు కానీ కార్యరూపం దాల్చలేదు.

నేడు

43వ వార్డు కార్పొరేటర్‌గా గెలుపొందిన పెద్దిశెట్టి ఉషశ్రీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు శ్రీనివాసనగర్ గెడ్డపై ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో విశాలమైన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పాత బ్రిడ్జి తొలగించి కార్లు సైతం రాకపోకలు సాగించేలా రూ.33.50 లక్షల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మించారు. దీంతో అక్కడి ప్రజల చిరకాల కోరిక నెరవేరింది.



శ్రీనివాసనగర్ నుంచి 80 అడుగుల రోడ్‌కు వెళ్లే మార్గం

గతంలో పాత బ్రిడ్జి వెడల్పు	: 4 మీటర్లు
కొత్త బ్రిడ్జి వెడల్పు	: 6 మీటర్లు
అప్రోచ్‌రోడ్ విస్తరణ	: 10 అడుగులు
చేసిన ఖర్చు	: రూ.33.50 లక్షలు
ప్రయోజనం	: మూడు వేల కుటుంబాల రాకపోకలు సులభతరం

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్ ప్రాంతానికి సరైన రోడ్డు కనెక్టివిటీ లేక ఎంతో కాలంగా పడుతున్న ఇబ్బందులు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కృషితో తొలగిపోయాయి. వార్డు పరిధిలో శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోశీలపాలెం ప్రాంతాల నుంచి రాజగిరి లే అవుట్ మీదుగా 80 అడుగుల రోడ్‌కుగానీ, అటు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌కు గానీ వెళ్లడానికి సరైన రహదారి సదుపాయం లేక దశాబ్దాల కాలంగా అవస్థలు పడుతున్నారు. ఇరుకైన రోడ్ కావడంతో కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లడానికి అవకాశం ఉంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రావడానికి మార్గం లేని పరిస్థితి. స్థానికుల అభ్యర్థనతో శ్రీనివాసనగర్ గెడ్డ నుంచి కర్రివాని బ్రిడ్జి వరకు రోడ్ కమ్ బ్రిడ్జి నిర్మించాలని 2018లో ప్రతిపాదించారు. దీని కోసం అప్పట్లో జీవీఎంసీ రూ.12 లక్షలు కేటాయించింది. అనంతరం టెండర్లు పిలిచి, కార్యరూపం దాల్చే లోపు అప్పటి కార్పొరేటర్ల పదవీకాలం ముగియడంతో ఆ ప్రతిపాదన మరుగున పడింది.

నెరవేర్చిన ఎన్నికల హామీ

శ్రీనివాసనగర్ వాసుల చిరకాల సమస్యను **తీరుస్తానని ప్రస్తుత కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ** ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ **మేరకు జీవీఎంసీ నుంచి రూ.**33.50 లక్షలు నిధులు **మంజూరు చేయించారు.** సమస్యను పరిష్కరించేలా శ్రీనివాసనగర్ గెడ్డపై నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగించేలా కొత్తగా బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జికి రెండు వైపులా అప్రోచ్‌రోడ్ నిర్మించారు. నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు సాగించేలా విశాలమైన బ్రిడ్జి నిర్మాణంతో శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోశీలపాలెంలో నివసిస్తున్న మూడు వేల కుటుంబాల్లోని సుమారు 12 వేల జనాభాకు ప్రయోజనం చేకూరింది. ఆయా ప్రాంతాల నుంచి 80 అడుగుల రోడ్‌కు కనెక్టివిటీ ఏర్పడింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చిన వార్డు కార్పొరేటర్ ఉషశ్రీకి స్థానికులు అభినందనలు తెలియజేసుకుంటున్నారు.



నాడు : శ్రీనివాసనగర్ గెడ్డపై పాత బ్రిడ్జి



నేడు : విస్తరణ అనంతరం శ్రీనివాసనగర్ గెడ్డపై కొత్త బ్రిడ్జి

బ్రిడ్జి విస్తరణతో సులభంగా రాకపోకలు



బ్రిడ్జి విస్తరణ వల్ల ఆటోలు, కార్లు, అంబులెన్స్ వంటి వాహనాలు 80 అడుగుల రోడ్ నుంచి శ్రీనివాసనగర్ ప్రాంతానికి వచ్చే వీలు కలిగింది. బ్రిడ్జి అప్రోచ్ రోడ్ విస్తరణ కోసం గెడ్డ పక్కనే ఉన్న ప్రైవేటు స్థలం యజమానికి టీడీఆర్ ఇచ్చి జీవీఎంసీ స్థల సేకరణ చేసింది. దీంతో 10 అడుగులకు రోడ్ వెడల్పు పెరగడంతో 80 అడుగుల రోడ్ వైపు నుంచి శ్రీనివాసనగర్ వైపు వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అయ్యింది.

– రాజగిరి సింహాచలం, గ్రామ సంఘం అధ్యక్షులు

కార్లు, ఆటోల ప్రయాణానికి వీలుగా..



శ్రీనివాసనగర్ గెడ్డపై ఉన్న బ్రిడ్జి, అప్రోచ్ రోడ్ ఇరుకుగా ఉండడంతో గతంలో ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించేవి. కార్లు, ఆటోలు, రావడానికి వీలయ్యేది కాదు. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన ఉషశ్రీకి బ్రిడ్జి విస్తరణ చేపట్టాలని వినతిపత్రం అందజేశాం. ఆమె గెలిచిన తర్వాత ఇచ్చిన మాట మేరకు బ్రిడ్జి విస్తరణ చేసి మా కాలనీ సమస్య పరిష్కరించారు.

– వెంపదాపు అప్పలరాజు, శ్రీనివాసనగర్

చాలా ఆనందంగా ఉంది



నగరం మధ్యలో ఉన్న మా కాలనీకి ఆటోలు, కార్లు వచ్చేవి కాదు. ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కార్పొరేటర్ ఉషశ్రీ కృషితో మా కాలనీ సమస్య పరిష్కారమైంది. చాలా ఆనందంగా ఉంది.

– వి.హారిక, విద్యార్థిని, శ్రీనివాసనగర్

క్లుప్తంగా

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కేకే రాజు

మద్రిపాలెం: స్మార్ట్ సిటీ పాస్టర్స్, ఇవాంజిలిస్ట్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను 53వ వార్డు అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా పవిత్ర క్రిస్మస్ పండగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, 26వ వార్డు ఇన్‌చార్జ్ పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధి 42వ వార్డు రైల్వేన్యూకాలనీలో శ్రీ లలితా మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం గౌరీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ఇటీవల ప్రారంభమైన ఈ ఉత్సవాలు 9వ తేదీ వరకు జరగనున్నాయి. బుధవారం సారె మహోత్సవం, శుక్రవారం అన్నదానం, శనివారం అనుపు మహోత్సవాలు జరుగనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. కల్యాణంలో సూరిశెట్టి అప్పలకొండ, సూరిశెట్టి అచ్యుతరామ్, కాండ్రేగుల నాగరాజు, శరకం రాజు, శరకం సూరిబాబు, కండ్రపు బ్రహ్మజీ, రెడ్డి వెంకటరమణ, కట్టి రాము, లలితా గ్రూప్, బుల్లెట్ బాయ్స్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



ప్రచారంలో ఆధ్యాత్మిక గ్రంథాలతో సభ్యులు

కంచరపాలెం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. యోగ సాధన చేయడానికి గుర్తుగా దీపాలను నిత్యం వెలిగించాలని కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ముందుగా ఆధ్యాత్మిక గ్రంథాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేవి, మంగ, పద్మ, మల్లేష్, గణేష్, శ్రేయ, అరుణ్, రామకృష్ణ, అంబిక, అప్పారావు, మహలక్ష్మి, లక్ష్మి, సర్వధారి, అక్షయ్ కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

తుపానుతో ప్రజల అవస్థలు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం రాత్రి నుంచి వర్షం కురవడంతో ప్రజలు బయటకు రాలేకపోయారు. ముఖ్యంగా సోమవారం కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. జాతీయ రహదారితో పాటు సర్వీసు రోడ్లపై నీటి ప్రవాహం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చలిగాలులు వీయడంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడ్డారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

మార్మోగిన శివనామస్మరణ



సీతంపేట పార్వతీశ్వరాలయంలో శివునికి క్షీరాభిషేకం

సీతంపేట: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం వద్ద శివయ్య దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శివునికి క్షీరాభిషేకాలు, అర్చనలు, ధ్వజస్తంభం వద్ద దీపారాధనతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మహిళలు ఉపవాసం అనంతరం సాయంత్రం ఆలయాన్ని మరలా దర్శించి పూజలు చేశారు. సీంపేటలోని పార్వతీశ్వరుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రమాబాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతమ్మధార : సీతమ్మధారలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 24వ వార్డు నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచి అర్చకులు రామారావు శర్మ, మహేష్ పంచామృతాలు, పళ్లరసాలతో అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. అలాగే నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో గల మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీ షిర్డిసాయి బాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. గణేష్ నగర్‌లోని శివపార్వతి సమేత త్రిముఖ విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని శివాలయాల్లో కార్తీక మాసం మూడో సోమవరం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వర్షం కురుస్తున్నప్పటికీ శివాలయాలను దర్శించుకున్నారు. మురళీనగర్ రామాలయం ఆవరణలో వెలసిన ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివునికి పంచామృతాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం శివయ్యను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సత్యానగర్ – 1లోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



కాలబైరవ అలంకరణలో పార్వతీశ్వరుడు



పూజ చేస్తున్న అర్చకులు రామారావు శర్మ



శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

స్పందనకు 8 అర్జీలు



అర్జీదారు నుంచి వినతి స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 8 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎం.ఆనందకుమార్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లపై అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తుపానుపై అప్రమత్తత

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ తహసీల్దార్ ఆనందకుమార్ తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ కొండవాలు, లోతట్టు ప్రాంతాలవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలూ తనతోపాటు డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బందులుంటే 98499 03824 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని ప్రాంతాలనూ అప్రమత్తం చేశామన్నారు.

ప్రాధాన్యతా భవనాల ప్రారంభోత్సవం



శాంతినగర్‌లో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కేకే రాజు, కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు శాంతినగర్, సంజీవయ్యకాలనీ–1లో కొత్తగా నిర్మించిన సచివాలయ, సామాజిక భవనాలను రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, డిప్యూటీ మేయర్, పార్టీ మండల ఇన్‌చార్జి కటుమూరి సతీష్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమంతోపాటు, అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల ఏర్పాటుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. సుమారు రూ 49.70 లక్షలతో శాంతినగర్‌లో, రూ.15.45 లక్షలతో సంజీవయ్యకాలనీ–1లో నూతన భవనాలను నిర్మించారు. వీటిలో సచివాలయాలు, దాస్ ఫౌండేషన్ గ్రూప్స్, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు అప్పారావు, డీఈ భరణికుమార్, ఏఈ ఉమామహేశ్వరరావు, వార్డు నాయకులు గోవింద్, చిన్నా, నర్సింగరావు, రామారావు, స్వామినాయుడు, శ్రీను, ఈశ్వరరావు, దుర్గాభవాని, లావణ్య, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం



కల్యాణంలో ఈవో శ్రీనివాసమూర్తి, రెయ్యి వెంకటరమణ తదితరులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్షిక కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో ఆగమ పాఠశాల పండితులు, వేద పండితుల శిష్య బృందంతో ఆలయ ప్రధాన అర్చకుడు నేదునూరి శ్రీనివాస శర్మ కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కల్యాణం చేశారు. కార్తీక మాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

జూలో సౌకర్యాల మెరుగు



జూ కొలను ఒడ్డున ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలపై సేదదీరుతున్న సందర్శకులు



ఆట పరికరాల వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఇటీవల సౌకర్యాలు మెరుగుపడ్డాయి. తాగునీరు, షెల్టర్లతో పాటు ఇటీవల విశాలమైన ప్రదేశాలలో చెట్ల కింద బెంచీలు, ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జూలో వన్యప్రాణులు చూడడానికి వచ్చిన సందర్శకుల కోసం విశ్రాంతి తీసుకోవడానికి షెల్టర్లు నిర్మించారు. ఇప్పుడు జంతువులు, పక్షుల ఎన్‌క్లోజర్ల ముందు కొన్నిచోట్ల ఇనుము, సిమెంట్‌తో చేసిన బెంచీలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటిపై సందర్శకులు కూర్చుని సేదదీరుతున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో ఎక్కువ మంది కుటుంబ సభ్యులతో వచ్చి పిక్నిక్‌లు జరుపుకొంటున్నారు. సౌకర్యవంతంగా కూర్చుని భోజనాలు చేస్తున్నారు. ఏనుగులు, తెల్ల పులులు, ఎలుగుబంట్లు, నీటి ఏనుగులు, జూ సావనీర్ ఎదురుగా ఉండే కొలను ఒడ్డున, అడవి దున్నల ఎన్‌క్లోజరు ముందు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆట పరికరాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

జూ క్యాంటీన్ పక్కన, కనుజుల ఎన్‌క్లోజరు ఎదురుగా రెండు చోట్ల పిల్లల కోసం ఊయలలు, జారుడు బల్లలు, తూగుడు బల్లలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. వాటి వద్ద పిల్లలు సరదాగా గడుపుతున్నారు.

49వ వార్డులో ఓటర్ల నమోదు

మురళీనగర్: మురళీనగర్‌లోని 49వ వార్డు మసీదు కూడలిలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై ప్రజలకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సహకరించారు. కార్యక్రమంలో భట్రాజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొని ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం నేతృత్వంలో ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి మాట్లాడుతూ మార్గశిర మాసోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, మారుతీ ప్రసాద్, సురేష్, ప్రకాష్, సహాయ ఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

బీచ్ రోడ్డు: అక్రమంగా రవాణా చేస్తున్న 18 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కంచరపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం రైల్వేస్టేషన్ కార్ పార్కింగ్ వద్ద గంజాయి రవాణా జరుగుతుందని అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ బృందం తనిఖీలు చేపట్టింది. ముగ్గురు వ్యక్తుల నుంచి 18 కేజీల గంజాయితో పాటు మూడు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కంచరపాలెం పోలీసు స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.